2024 ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

- ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి
- టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన 20 కుటుంబాలు



ప్రశాంతినిలయం: పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

ప్రశాంతి నిలయం: రాష్ట్రంలో 2024లో జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం అందరం శ్రమించాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. అమడగూరు మండల తుమ్మల పంచాయతీలో టీడీపీకి చెందిన 20 కుటుంబాల వారు ఆదివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. పుట్టపర్తిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వారందరికీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జగన్ మోహన్‌రెడ్డిని మరో మారు ముఖ్యమంత్రిగా చేసుకోవడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త క్షేత్రస్థాయిలో కష్టపడి పని చేయాలన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని వెల్లడించారు. ప్రతిపక్ష పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు, నియోజకవర్గంలో ఎమ్మెల్యే దద్దుకుంట శ్రీధర్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి వైఎస్సార్‌సీపీలో చేరినట్లు టీడీపీ నాయకులు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో లక్ష్మీనారాయణ, రమేష్, నరసింహులు, గంగులప్ప, పెద్ద గంగులప్ప, అంగజాల అరుణ్, బాలకృష్ణ, మణి, శివప్రసాద్, నాగేంద్ర నాయక్, రామచంద్ర, లక్ష్మీనారాయణ, శివన్న, రామచంద్ర, తుమ్మల రామచంద్ర తదితరులు ఉన్నారు.

పరామర్శ

నల్లమాడ: మసకవంకపల్లి గ్రామ మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎస్.రాంమోహన్‌రెడ్డి ఆదివారం పాముకాటుకు గురయ్యారు. పుట్టపర్తిలోని జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆస్పత్రికి వెళ్లి రాంమోహన్‌రెడ్డిని పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి వర్గాలకు సూచించారు. అంతకుముందు సింగినేయకుంటకు చెందిన ముక్తాపురం రవీంద్రారెడ్డి, రెడ్డిపల్లికి చెందిన రమణారెడ్డి నూతన గృహ ప్రవేశాలకు హాజరయ్యారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పీవీ భాస్కర్‌రెడ్డి, సహకార సంఘం అధ్యక్షుడు ఏ.గంగిరెడ్డి, నాయకుడు అంజినాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరంతో పేదలకు ఊరట



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: ఉచిత వైద్య శిబిరంతో పేదలకు ఊరటనిస్తున్నామని రోటరీక్లబ్ అధ్యక్షుడు జయసింహ, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కలవల మురళీధర్ తెలిపారు. పట్టణంలోని ఆర్యవైశ్య కొత్త సత్రంలో ఆదివారం రోటరీక్లబ్, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మెగా వైద్య శిబిరంలో ప్రజలందరికి ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నామనానరు. అవసరమైన వారికి మందులు కూడా ఉచితంగా అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. వైద్య శిబిరంలో 107 మంది వైద్య చికిత్సలు చేయించుకున్నారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ కార్యదర్శి సుదర్శన్‌గుప్త, సభ్యులు నరేంద్రరెడ్డి, ఆర్యవైశ్య సంఘం కోశాధికారి ప్రసాద్, నాగరాజు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

2న మండల సర్వసభ్య సమావేశం

బత్తలపల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సెప్టెంబర్ 2వ తేదీన ఎంపీపీ బగ్గిరి త్రివేణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సౌజన్యకుమారి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు అందరూ తప్పక హాజరు కావాలన్నారు. అలాగే మండలంలోని అన్ని శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో హాజరు కావాలని కోరారు.

పాఠశాలలో వైద్య శిబిరం



విద్యార్థులకు సూచనలిస్తున్న వైద్యులు

కదిరి అర్బన్: మండల పరిధిలోని కాళసముద్రం అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఆదివారం పట్నం వైద్యాధికారులు మెడికల్ క్యాంప్ నిర్వహించారు. పాఠశాలలో మొత్తం 584 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. 35 మంది విద్యార్థులకు సాధారణ జలుబు, దగ్గు, 5 మంది విద్యార్థులకు నామమాత్రపు చర్మ సమస్యలు ఉన్నట్లు గుర్తించ్చారు. అనంతరం వీరికి వైద్య చికిత్సలు చేశారు. పాఠశాలలో పరిశుభ్రత పాటించాలని వైద్యులు సూచించారు. విద్యార్థులకు ఏమైనా చర్మ సమస్యలు ఉంటే వెంటనే గురుకుల హెల్త్ సూపర్‌వైజర్, హౌస్ టీచర్‌కు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో పట్నం మెడికల్ ఆఫీసర్ ప్రమీల, డాక్టర్లు నిరోషా, లక్ష్మి, ప్రిన్సిపాల్ దాదాపీర్, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



కోదండ రామాలయ కమిటీ సభ్యులకు నగదు అందజేస్తున్న నాయకులు

గాండ్లపెంట: మండల పరిధిలోని వేపరాలలో నూతనంగా నిర్మిస్తున్న కోదండ రామాలయ నిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ఆదివారం రూ.50 వేలు విరాళంగా అందించారు. ఈ విరాళాన్ని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు గజ్జల రవీంద్రారెడ్డి, లోకేశ్వరరెడ్డి, రమణానాయక్, జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. ఆలయ నిర్మాణానికి తనవంతు సహకారం అందించినందుకు ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పెద్దమ్మ దేవతకు పూజలు

తాడిమర్రి: స్థానిక పెద్దమ్మ దేవత ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి అమ్మవారి మూలవిరాట్‌కు వెండి ఆభరణాలు తొడిగి, పూలమాలలతో అందంగా అలంకరించారు. అనంతరం అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మవారికి కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పూజారి భక్తులకు ప్రసాదం అందజేశారు.

పూర్వ విద్యార్థుల సందడి



సమావేశమైన పూర్వ విద్యార్థులు

తలుపుల: మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో 2000–01 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒకరికొకరు యోగ క్షమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని తీర్మానించారు.

క్రీడల్లో రాణించాలి



బ్యాటింగ్ చేసి టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ టి.కల్పలతా రెడ్డి

తలుపుల: క్రీడా పోటీలు యువతకు ఉత్సాహాన్నిస్తాయి. యువత క్రీడల్లో రాణించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ టి.కల్పలతారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని బట్రేపల్లి రోడ్డు సమీపంలో ఆదివారం వైఎస్సార్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తల హరిప్రసాద్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రదాన కార్యదర్శి బత్తల వెంకటరమణ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మగ్బుల్ బాషా బౌలింగ్ వేయగా.. ఎమ్మెల్సీ టి.కల్పలతారెడ్డి బ్యాటింగ్ చేసి టోర్నీని ప్రారంభించారు. తొలుత స్థానిక మూడు రోడ్ల కూడలిలో ఉన్న మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ రఫీనాయక్, మాజీ సర్పంచులు సూర్యనారాయణరెడ్డి, ఫయాజ్ అహమ్మద్, కృష్ణారెడ్డి, సేవాదళ్ జోనల్ ఇన్‌చార్జి డీకే బాబు, మర్రిరామయ్య, ప్రభు, మౌలా, హరి పాల్గొన్నారు.

పోతలయ్యస్వామికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న పోతలయ్య స్వామి

కనగానపల్లి: మండలంలోని దాదులూరు పోతలయ్యస్వామికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టు గ్రామాల నుంచి గాక జిల్లాల నలుమూలల నుంచి వచ్చిన భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి, బోనాలు సమర్పించారు. తర్వాతా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి పోతలయ్యస్వామిని దర్శించుకున్నారు.

నేడు విగ్రహాల ప్రతిష్ట



వేపరాలలో నిర్మించిన రామాలయం

గాండ్లపెంట: మండల పరిధిలోని వేపరాలలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు సీతారామ లక్ష్మణ హనుమంతుడి విగ్రహ ప్రతిష్టాపన త్సోవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు గణపతి పూజ, నాందిపూజ, రక్షాబంధనం, 29న వేదపారాయణం, యాగశాల ప్రవేశం, సాయంత్రం 4 గంటలకు గణపతి హోమం, నవగ్రహ హోమం 108 కలశాలతో విగ్రహాలకు అభిషేకం, తీర్థప్రసాద వినియోగం, రాత్రికి భజన బృందాలతో శ్రీరామభజన నిర్వహిచనున్నారు. 30న విగ్రహ ప్రాణ ప్రతిష్ట, రాత్రికి చెక్కభజన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. భక్తులకు దాతల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

కమనీయం.. కల్యాణోత్సవం



స్వామికి కల్యాణం జరిపిస్తున్న ప్రధాన అర్చకుడు

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రీదేవి భూదేవి సమేత వసంతవల్లభుడికి ఆదివారం అర్చకులు ఆర్జిత కల్యాణం జరిపించారు. అంతకుముందు శ్రీదేవి భూదేవి వసంతవల్లభుడిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేపట్టారు. అనంతరం స్వామికి కానుకలు సమర్పించారు.

గోవా గవర్నర్‌ను కలసిన ఎస్పీ



గోవా గవర్నర్ శ్రీధరన్ పిళ్లైకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: ప్రశాంతి నిలయంలో జరగనున్న ఓనం వేడకల్లో పాల్గొనేందుకు ఆదివారం గోవా రాష్ట్ర గవర్నర్ శ్రీధరన్ పిళ్లై విచ్చేశారు. ఈ సందర్భంగా ప్రశాంతి నిలయం శాంతిభవన్‌లో గవర్నర్ శ్రీధరన్ పిళ్లైను ఎస్పీ మాధవరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



కుళ్లాయప్ప

ధర్మవరం అర్బన్: పట్టణంలోని లక్ష్మీనగర్‌కు చెందిన కుళ్లాయప్ప ఎరగుంట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కాయల వ్యాపారం చేసే కుళ్లాయప్ప ద్విచక్ర వాహనంలో చెన్నేకొత్తపల్లి మండలానికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో పట్టణంలోని ఎరగుంట సర్కిల్‌లో కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలు కావడంతో అతడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స చేసి అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

టోర్నీ విజేత తనకల్లు జట్టు



తనకల్లు జట్టుకు ట్రోఫీలు అందజేస్తున్న దృశ్యం

తనకల్లు: డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా తనకల్లు టైటాన్ జట్టు నిలిచింది. స్థానిక రాచువారిపల్లి క్రీడా మైదానంలో ఆదివారం తనకల్లు–కొక్కంటిక్రాస్ జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. ముందుగా బ్యాటింగ్ చేసిన కొక్కంటిక్రాస్ జట్టు నిర్ణీత 16 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 108 పరుగులు చేసింది. అనంతరం 109 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన తనకల్లు జట్టు 14 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి విన్నర్‌గా నిలిచింది. టైటాన్ జట్టులో నగేష్ 48 పరుగులు చేశాడు. అనంతరం విజేత జట్టుకు ట్రోఫీలు అందజేశారు. మండల స్థాయిలో విజేతగా నిలిచిన తనకల్లు జట్టు కదిరి నియోజకవర్గ స్థాయిలో జరిగే పోటీలకు అర్హత సాధించింది. కార్యక్రమంలో ఆర్గనైజర్, మాజీ ఎంపీటీసీ ఆదినారాయణ పాల్గొన్నారు.

గాండ్లపెంట సీనియర్ జట్టు విజయకేతనం

గాండ్లపెంట: డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా గాండ్లపెంట సీనియర్ జట్టు నిలిచింది. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం గాండ్లపెంట సీనియర్, జూనియర్ జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో గాండ్లపెంట సీనియర్ జట్టు విజయం సాధించింది. విజేత జట్టు నియోజకవర్గంలో నిర్వహించే క్రికెట్ టోర్నీకి అర్హత సాధించింది. విజేత జట్టును వైఎస్సార్‌సీపీ నాయకుడు బత్తల వెంకటరమణ అభినందించారు. కార్యక్రమంలో నాయకులు పురుషోత్తంరెడ్డి, ఫారుక్, బహావుద్దీన్, ఫక్రుద్దీన్, సికిందర్ పాల్గొన్నారు.

విజేతగా 'క్రేజీ లెవెన్స్'



ఎన్‌పీకుంట: టాస్ ఎగురవేస్తున్న సింగిల్ విండో అధ్యక్షుడు జగదీశ్వర్ రెడ్డి

ఎన్‌పీకుంట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గత నాలుగు రోజులుగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్ ఆధ్వర్యంలో డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఇందులో 13 జట్లు పాల్గొనగా ఎన్‌పీకుంటకు చెందిన క్రేజీ లెవెన్స్ జట్టు విన్నర్‌గా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్ లో క్రేజీ లెవెన్స్ జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. నిర్ణీత 10 ఓవర్లలో ఎన్.పీ.కుంట వారియర్స్ జట్టు 90 పరుగులు చేయగా, క్రేజీ లెవెన్స్ జట్టు 9.3 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేధించి విజేతగా నిలిచింది. అంతకుముందు సింగిల్ విండో అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకుని మ్యాచ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్గనైజర్లు లోకేశ్, వినయ్ పాల్గొన్నారు.

కృష్ణాష్టమి నిర్వహణపై సమావేశం

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని నాగభూషణ వేరుశనగ మిల్లులో ఆదివారం త్వరలో జరగనున్న కృష్ణాష్టమి వేడుకల నిర్వహణపై యాదవ నాయకులు సమావేశం నిర్వహించారు. కృష్ణాష్టమి పండుగను పురస్కరించుకుని శ్రీకృష్ణుడి ప్రతిమ ఊరేగింపు, ఉట్టి కొట్టడం, అన్నదానం తదితర కార్యక్రమాలపై చర్చించారు. వేడుకల నిర్వహణకు చందాలు వేసుకోవాలని సంఘం సభ్యులు నిర్ణయం తీసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ కృష్ణయ్య, నాగభూషణ, కృష్ణమూర్తి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనం ఢీ

ముదిగుబ్బ: మండల పరిధిలోని దురిగల్లు సమీపంలో ఘాట్‌రోడ్డులో ఆర్టీసీ బస్సు–ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొన్న సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పుల్లివెందుల మండలం నల్లగుండయ్యగారి పల్లికి చెందిన మునీంద్ర వ్యక్తిగత పనిమీద ద్విచక్ర వాహనంలో ముదిగుబ్బ వైపునకు బయలుదేరాడు. పులివెందుల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ముదిగుబ్బ నుంచి పులివెందులకు వెళ్తుతుండగా ఘాట్‌రోడ్డులో రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ఘటనలో మునీంద్రకు తీవ్ర గాయాలయ్యాయి. బస్సులో ప్రయాణికులు 108 వాహనానికి సమాచారం ఇవ్వగా 108 వాహనంలో సంఘటన స్థలానికి చేరుకుని బాధితుడిని అనంతపురం ప్రవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పూర్వ విద్యార్థుల తోడ్పాటు అభినందనీయం

- జేఎన్‌టీయూ వీసీ జింకా రంగ జనార్దన

అనంతపురం: జేఎన్‌టీయూ కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల తోడ్పాటు అభినందనీయమని వీసీ జింకా రంగ జనార్దన తెలిపారు. ఆదివారం జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో 1994– 98 బ్యాచ్ విద్యార్థులు కళాశాలను సందర్శించారు. మెకానికల్ సెమినార్ హాలులో పూర్వ విద్యార్థులు సమావేశమై, ఉపకులపతి ఆచార్య రంగ జనార్దనతో ఆన్‌లైన్ ద్వారా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సహకారంతో కళాశాలను అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. కళాశాలలో చదువుకున్న విద్యార్థులు ఎంతో గొప్ప హోదాల్లో ఉన్నారని, కళాశాల అభివృద్ధికి తోడ్పాటునందిస్తున్నారన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య శశిధర్ మాట్లాడుతూ కళాశాలకు అల్యూమినీ అసోషియేషన్ బలం అని, యూనివర్సిటీ అభివృద్ధికి వీరి సలహాలు, సూచనలు ఎల్లప్పుడూ తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు డాక్టర్ హరినాథ్‌రెడ్డి, శివరామిరెడ్డి (లండన్), డాక్టర్ ఎం. నాగమణి (హైదరాబాద్), ఓబుల్‌రెడ్డి (మైక్రోసాఫ్ట్ కంపెనీ, పూణే), మనోహర్‌రెడ్డి (ఎంవీఐ), శ్రీనివాసులు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం



ఫుట్‌బాల్ లీగ్ మ్యాచ్‌ల ప్రారంభోత్సవంలో పాల్గొన్న క్రీడాకారులు

పరిగి: అనంతపురం ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో 10వ అనంతపురం ఫుట్‌బాల్ లీగ్ మ్యాచ్‌లు ఆదివారం ప్రారంభమయ్యాయి. మండలంలోని సేవామందిరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో అండర్ 13, 15, 17, 18 విభాగాల్లో బాల బాలికలకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి కార్తీక్ తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఆగస్టు నుంచి డిసెంబర్ వరకూ ఏఎఫ్‌ఎల్ లీగ్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఆదివారం పరిగి సౌత్ జట్టుతో సోమందేపల్లి జట్టు తలపడింది. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు నాగబూషణ, నరసింహమూర్తి, హరీష్, సునీల్, విష్ణు, హేమంత్, సాయి, క్రీడాకారులు పాల్గొన్నారు.

కలశాల ఊరేగింపు

మడకశిరరూరల్: కర్ణాటకలోని పావగడ తాలుకాలోని దొమ్మతమర్రి గ్రామం నుంచి ఆదివారం సాయంత్రం గురుకరిబసవేశ్వరస్వామి విగ్రహంతో పాటు 101 కలశాలను ఊరేగింపుగా మడకశిర మండలం ఆమిదాలగొందికి తీసుకెళ్లారు. ఆ గ్రామంలోని గురుకరిబసవేశ్వరస్వామి ఆలయం వద్ద 101 కలశాలు, స్వామి వారి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కరిబసవేశ్వరస్వామి విగ్రహాన్ని ఆలయానికి అందించారు. అంతకు ముందు అనుమరెడ్డి, వెంకటరెడ్డి ఇళ్లలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఆస్పత్రిలో తాగుబోతు హల్‌చల్

కొత్తచెరువు: కొత్తచెరువు ప్రభుత్వ ఆసుపత్రిలో ఆదివారం చికిత్స కోసం వెళ్లిన ఓ తాగుబోతు వీరంగం సృష్టించాడు. ఆ వ్యక్తికి చికిత్స చేసేందుకు వైద్య సిబ్బంది ప్రయత్నించగా దుర్భాషలాడాడు. రాళ్లతో దాడి చేశాడు. దీంతో భయాందోళనకు గురైన సిబ్బంది స్థానిక పోలీస్ స్టేషన్‌లో సదరు వ్యక్తిపై ఫిర్యాదు చేశారు.

బైక్‌పై నుంచి పడి యువకుడికి తీవ్ర గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని రజాపురం గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం వేకువజామున ద్విచక్ర వాహనంపై నుంచి పడి ఓనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. నంద్యాల జిల్లా నందికొట్కూరుకు చెందిన ప్రేమ్ కుమార్ గుంతకల్లులో జరిగే బంధువుల వివాహ వేడుకకు బైక్‌పై బయలుదేరాడు. అయితే రజాపురం గ్రామ సమీపంలో గురుకుల పాఠశాల ఎదురుగా వేగంగా వెళ్తున్న ప్రేమ్‌కుమార్ మట్టి కుప్పను ఢీ కొట్టి బైకు అదుపుతప్పి కిందపడ్డాడడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ప్రేమ్‌కుమార్‌ను చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు కర్నూలుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు 'స్పందన'

తాడిమర్రి: మండలంలోని గ్రామ సచివాలయాల్లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడిమర్రి, పెద్దకోట్ల, దాడితోట, చిల్లవారిపల్లి, కునుకుంట్ల, పిన్నదరి, నార్శింపల్లి, ఎం.అగ్రహారం, చిన్నచిగుళ్లరేవు తదితర గ్రామ సచివాలయాలతో పాటు తహసీల్దార్ కార్యాలయంలో కూడా స్పందన కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే స్పందనలో మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

బత్తలపల్లి: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో సోమవారం స్పందన కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ యుగేశ్వరిదేవి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని 11 గ్రామ సచివాలయాల్లో సచివాలయ ఉద్యోగులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారన్నారు.

శుభకార్యం



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: బుక్కపట్నం మండలంలో ఆదివారం జరిగిన పలు వివాహాలు, గృహ ప్రవేశాలకు ఎమ్మెల్యే దుద్దుకుంట హాజరయ్యారు. సిద్దరాంపురం గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు చెన్నుడు కుమారుడు శ్రీకాంత్, సత్యకుమారిల వివాహం, మండల కేంద్రంలో జరిగిన అంజి, వైష్ణవిల వివాహాలకు హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. అలాగే మండల పరిధిలోని గణికవారిపల్లిలో మాజీ ఎంపీటీసీ రంగారెడ్డి గృహ ప్రవేశానికి ఎమ్మెల్యేతో పాటు ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి హాజరయ్యారు. అనంతరం గణికవారిపల్లిలో ఇటీవల వడ్డే గిరి మృతి చెందడంతో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమాల్లో డీఈ రాచంరెడ్డి భాస్కర్‌రెడ్డి, మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేశప్ప, జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ రమణారెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ గోవర్దన్‌రెడ్డి, సర్పంచులు గోవిందరెడ్డి, రమణయ్య, సొసైటీ అధ్యక్షుడు బాలం రమణారెడ్డి, రామలింగారెడ్డి, విజయారెడ్డి, మిద్దె భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రామకృష్ణ సొసైటీ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన చెస్ చాంపియన్‌షిప్ పోటీలు



గెలుపొందిన చెస్ క్రీడాకారులు

అనంతపురం: నగరంలో కేఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్–15 ఓపెన్ ఫిడే రేటింగ్ చెస్ చాంపియన్ షిప్–2023 పోటీలు ఆదివారంతో ముగిశాయి. స్విస్ లీగ్ పద్ధతిలో మొత్తం 8 రౌండ్ల పోటీలు నిర్వహించారు. అందులో 8/8 పాయింట్లతో చాంపియన్ షిప్ టైటిల్‌ను విజయవాడకు చెందిన ఫిడే మాస్టర్ యండి ఇమ్రాన్ (క్లాసికల్ రేటింగ్ 2197) సాధించాడు. రన్నరప్‌గా అనంతపురం జిల్లాకు చెందిన శామ్యూల్ స్టీఫెన్ నోబల్ 7/8 పాయింట్లు సాధించాడు. మూడో స్థానం తూర్పుగోదావరికి చెందిన రామ్‌చరణ్‌తేజ 6.5/8 పాయింట్లు సాధించాడు. 4వ స్థానం తూర్పుగోదావరి జిల్లాకు చెందిన సీతాసాగర్ 6.5/8 పాయింట్లు సాధించాడు. ప్రతిభ చూపినవారికి 32 నగదు బహుమతులు అందించారు. టాప్ 4 క్రీడాకారులను రాష్ట్రం తరపున జాతీయ స్థాయి అండర్ 15 ఓపెన్ చెస్ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపిక చేసినట్లు టోర్నీ ఆర్గనైజర్ శ్రావణ్‌కుమార్, అసోషియేషన్ అధ్యక్షుడు శివకుమార్, గౌరవ చైర్మన్ బాలరాజు తెలిపారు. విజేతలకు ప్రిన్సిపాల్ శంకరయ్య, రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు బిసాంతి భరత్, జీవన్‌కుమార్, అతిథులు సుప్రజాచౌదరి, లక్ష్మీరంగయ్య, శ్రీనివాసప్రసాద్, ఉదయ్‌కుమార్‌నాయుడు చేతులమీదుగా బహుమతులు అందించారు.

రక్తదాతల వద్దకే రెడ్‌క్రాస్ వాహనం



రక్తదానం చేసిన వ్యక్తిని అభినందిస్తున్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

ధర్మవరం అర్బన్: రక్తదాతల వద్దకే ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వాహనం ఏర్పాటు చేశామని శ్రీ సత్యసాయి జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ పోలా ప్రభాకర్, పట్టణ చైర్మన్ డాక్టర్ నరసింహులు, వైస్ చైర్మన్ నరేంద్రరెడ్డి తెలిపారు. పట్టణంలో ఆదివారం రక్తదాతల ఇళ్ల వద్దకు వాహనాన్ని తీసుకెళ్లి రక్తదానం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్వచ్ఛంధ సంస్థల సహకారంతో రక్తదాతల ద్వారా రక్తాన్ని సేకరించామని తెలిపారు. ఎక్కడైనా 30 మంది లేదా 50 మంది రక్తదానం చేసేందుకు ముందుకు వస్తే గ్రామాలు, పట్టణాలు ఎక్కడైనా వారి వద్దకే సంచార వాహనాన్ని పంపిస్తామని పేర్కొన్నారు. రక్తదాతలు ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి శివయ్య, కోశాధికారి డాక్టర్ సత్యనిర్ధారణ్, యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు వైకే శ్రీనివాసులు, కార్యదర్శి సుకుమార్ పాల్గొన్నారు.

గిరిప్రదక్షిణకు ప్రత్యేక బస్సు

కదిరి అర్బన్: కదిరి ఆర్టీసీ డిపో నుంచి ఈనెల 30వ తేదీన అరుణాచలం గిరిప్రదక్షిణకు ప్రత్యేక బస్సు సర్వీసు నడుపుతున్నట్లు డీఎం మైనుద్దీన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 30వ తేదీ మధ్యాహ్నం 12:30 గంటలకు డిపో నుంచి బస్సు బయలుదేరుతుందన్నారు. పెద్దలకు రూ.860 టికెట్ చార్జీ ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 9959225892 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు

బత్తలపల్లి: అనంతపురం–కదిరి జాతీయ రహదారిపై మండల పరిధిలోని ఉప్పర్లపల్లి క్రాస్ వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ముదిగుబ్బ మండలం గాండ్లోరిపల్లి గ్రామానికి చెందిన కార్తీక్ ద్విచక్ర వాహనంలో బత్తలపల్లి వైపు వస్తున్నాడు. చిత్రావతి నది బ్రిడ్జిపై వేగంగా వస్తూ అదుపుతప్పి.. ఉప్పర్లపల్లికి క్రాస్ అవుతున్న గంగిరెడ్డిని ఢీకొట్టాడు. అదే వేగంతో రోడ్డు ప్రక్కన నిలబడిన వైస్ ఎంపీపీ గజ్జెల వెంగళరెడ్డి, రామాంజనేయులు, హోటల్ నిర్వాహకుడు రంగారెడ్డిని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో గంగిరెడ్డి గాయపడగా.. రంగారెడ్డికి కాళ్లు విరిగాయి. మిగిలిన ఇద్దరూ త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. వెంగళరెడ్డికి చెందిన ద్విచక్ర వాహనం దెబ్బతింది. క్షతగాత్రులను 108లో ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.